దళితులపై పెరిగిన దాడులు : ఎంపి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రాష్ట్రంలో దళితులపై దాడులు, అణచివేత చర్యలు ఆందోళనకర స్థాయిలో పెరిగిపోతున్న పరిస్థితులపై జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచందర్ పత్రికా ముఖంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన తెనాలిలో దళితుడిపై పోలీసులు పాశవికంగా దాడి చేసిన అంశాన్ని సుమోటోగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ అంశంపై వైసీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి స్పందిస్తూ జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడే సీరియస్‌గా స్పందించడం చూస్తుంటే కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక రాష్ట్రంలో పరిస్థితి ఎంత తీవ్రంగా మారిందో అర్ధం చేసుకోవాలన్నారు. దళితులపైనే దాడులు చేసి వారిపైనే కేసులు పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అన్యాయాన్ని ప్రశ్నించిన వారిపైనే అక్రమ కేసులు బనాయించి, జైల్లో వేసి వేధిస్తున్నారని మండిపడ్డారు. చుండూరు, కారంచేడు, తెనాలి, చీరాల వంటి అనేక వరుస సంఘటనల్లో దళితులపై దాడులు జరిగాయని పేర్కొన్నారు.

తిరుపతి, రేణిగుంటల్లో వామపక్షాల నిరసనలు

'గాంధీ' పేరు తొలగింపు సిగ్గుచేటు

'ఉపాధి' పేరు మార్పును వ్యతిరేకిస్తూ వామపక్షాల నిరసన

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించడం, ఈ పథకం అమలులో కేంద్ర ప్రభుత్వం తన రాజ్యాంగబద్ధమైన బాధ్యతను వదిలేసి వ్యయ భారాన్ని రాష్ట్రాలపై 40 శాతం మోపడం వంటి ప్రజావ్యతిరేక నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద వామపక్షాలు నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే ఒక సామాజిక భద్రతా పథకమని, అలాంటి పథకాన్ని దశలవారీగా నిర్వీర్యం చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం పేదల జీవన హక్కులపై నేరుగా దాడి చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు ఉండటం యాదచ్ఛికం కాదని, అది పేదల కోసం జరిగిన పోరాటాలకు ప్రతీకగా నిలిచిందని వామపక్ష నేతలు పేర్కొన్నారు. అలాంటి పేరును తొలగించడం అంటే గాంధీజీ ఆశయాలను తిరస్కరించడమే కాకుండా, పేదల సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపుతోందని ఆరోపించారు. ఇది పూర్తిగా రాజకీయ కక్షసాధింపుతో తీసుకున్న ప్రజావ్యతిరేక నిర్ణయమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తన ప్రజావ్యతిరేక నిర్ణయాలను వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు కేవేణుగోపాల్, ఎస్ జయచంద్ర, పి సాయి లక్ష్మి, ఆర్ .లక్ష్మి,యన్ మాధవ్, పి బుజ్జి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి హేమలత, ఎం. మాధవ్, సిపిఐ నేతలు చిన్నం పెంచలయ్య, కే రాధాకష్ణ, విశ్వనాధం, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీను, రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

– రేణిగుంటలో సిపిఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్, సిపిఐ మండల కార్యదర్శి వైఎస్ మణి, కాంగ్రెస్ నాయకులు చిరంజీవి, భారత్ గెట్ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జె.తులసిరాజన్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ బయట మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు ఒ.వెంకటరమణ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి కూటమి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక, ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా కుట్రకు పాల్పడిందన్నారు. ఉపాధి కూలీలకు 200 పనిదినాలు కల్పించి, రూ.600 రోజు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రంగయ్య, వెంకటాద్రి, ఈశ్వరమ్మ, సెల్వరాజ్, కార్తీక్, మురళి, రాజశేఖర్, సెల్వా పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా రాజశేఖర్, ముత్యాలరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ తిరుపతి జిల్లా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు రాష్ట్ర కార్యదర్శులు ఎస్ఎస్ నాయుడు, ఎన్నికల అధికారి నవకోటేశ్వరరావు తెలిపారు. జిల్లా అధ్యక్షులుగా జి జె రాజశేఖర్(దొరవారి సత్రం), ప్రధాన కార్యదర్శిగా కె ముత్యాల రెడ్డి(రేణిగుంట), గౌరవ అధ్యక్షులుగా డి రామచంద్రయ్య(తిరుపతి అర్బన్), సహ అధ్యక్షులుగా ఎం కుమారస్వామి(దక్కిలి), ఈ. గీతమ్మ (పుత్తూరు), కోశాధికారిగా మోహన్ బాబు (శ్రీకాళహస్తి రూరల్), జిల్లా కార్యదర్శులుగా బండి మధుసూదన్ రెడ్డి (తిరుపతి అర్బన్), ఎన్ శేఖర్ (వడమాల పేట), కె ప్రభాకర్ (సూళ్లూరుపేట), మస్తానయ్య (వాకాడు), జి సుధీర్ (గూడూరు), సి సురేష్ తిరుపతి (అర్బన్), సి వెంకటకష్ణ (బి ఎన్ కండ్రిగ), ఏ. పద్మజ (తిరుపతి అర్బన్), కే ఆదినారాయణ (వెంకటగిరి), టి గోవర్ధన రెడ్డి (నాయుడుపేట), ఏ హేమాంబ ధర రావు (కేవీ బి పురం), వై విజయ శ్రీ (తొట్టంబేడు), కే మోహన్ రెడ్డి (తిరుపతి రూరల్), ఏవి శివప్రసాద్ (ఒజిలి) ఎన్నికయ్యారు.నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడం కోసం, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

పారిశుధ్య మేస్త్రి సుబ్రమణ్యంకు సిపిఎం నివాళి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్

వెంకటగిరి మున్సిపాలిటీ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న మేస్త్రి పరమాల సుబ్రమణ్యం ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన మృతికి సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జిబిఎస్ మణ్యం, నాయకులు వడ్డిపల్లి చెంగయ్యలు సోమవారం పూలమాల వేసి నివాళి అర్పించారు. సిఐటియు జెండా ఎగురవేసి సుబ్రమణ్యంకు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరమాల సుబ్రమణ్యం మనమధ్య లేకపోయినా చిరస్థాయిగా హృదయాల్లో నిలిచిపోయారన్నారు. మేస్త్రిగా పనిచేస్తూ కార్మికుల సమస్యలపై ఎపుడూ ముందుండే నాయకుని మృతి ఉద్యమాలకు తీరని లోటన్నారు. సిఐటియు నాయకునిగా ఆయన జీవితం మొత్తం పేదల పక్షానే నిలిచిందన్నారు. విధుల్లో ఉంటూ అకస్మాత్తుగా మృతిచెందారన్నారు. మున్సిపల్ అధికారులు అన్ని విధాలా ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్.స్వరూపరాణి, జి.రాజగోపాల్, ఎ.మంజుల, ఎన్.ప్రసాద్, పెంచలయ్య, ఇందిరమ్మ, శ్రీను, టి.సుబ్బయ్య, రత్నమ్మ పాల్గొన్నారు.

ఈఎస్ఐ పరిమితిని రూ.30వేలకు పెంచాలి

తిరుపతి టౌన్ : రూ.21 వేలు ఉన్న ఈఎస్ఐ పరిమితిని 30 వేలకు పెంచాలని సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈఎస్ఐ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం ఇచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ కరీముల్లా మాట్లాడుతూ తిరుపతి నగరపాలక సంస్థ ఔట్సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రస్తుతం జీతభత్యాలు పెరిగాయని, రానున్న రోజుల్లో జీతభత్యాలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, గతంలో 2017 వ సంవత్సరంలో 18 వేల రూపాయలు ఉన్న పరిమితిని 21 వేలకు పెంచినట్లుగా తిరుపతి నగరపాలక సంస్థ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకే కాకుండా రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకులందరికీ ఈఎస్ఐ పరిమితిని 30 వేలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దేవేంద్ర, సురేష్, గోపి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

వెండి కాసుల హారం విరాళం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుచానూరులోని టిటిడి అనుబంధ ఆలయమైన శ్రీ శ్రీనివాస ఆలయానికి తిరుచానూరుకు చెందిన డి. సాంబశివరావు 600 గ్రాముల వెండి కాసుల హారాన్ని సోమవారం విరాళంగా అందించారు. ఈ మేరకు వెండి కాసుల హారాన్ని టిటిడి అర్చకులు బాబు స్వామి, అధికారులు ముని చెంగల్ రాయులు, ప్రసాద్ లకు దాత అందజేశారు. అనంతరం దాతకు స్వామి వారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలను అందించారు.

ఎన్టీఆర్ రాజు మృతి పార్టీకి తీరని లోటు

ప్రజాశక్తి - తిరుమల

ఎన్టీఆర్ రాజు మృతి పార్టీకి తీరని లోటు అని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు పనబాక లక్ష్మి అన్నారు. సోమవారం తిరుమలలో ఎన్టీఆర్ రాజు స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మను ఓదార్చారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎన్టీఆర్ రాజు మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని తెలిపారు. గతంలో ఆయన పార్టీకి ఎనలేని సేవలు అందించారన్నారు. టిటిడి పాలక మండలి సభ్యులుగా ఉన్నప్పుడు తిరుమలలో ఆయన అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, డిప్యూటీ మేయర్ ఆర్ .సి .మునికష్ణ , తెలుగుదేశం పార్టీ నాయకులు రాజు యాదవ్, భాష, బాలాజీ సుబ్బు ,మాధవ్ వేలు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రామానుజన్ స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి -తిరుమల

టీ ఎస్ ఎన్ పురం లోని శ్రీ చైతన్య పాఠశాలలో గణిత శాస్త్ర దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. గణిత శాస్త్ర అంశాలతో కూడిన నమూనాల ప్రదర్శనను వర్కింగ్ మోడల్స్, చార్టుల రూపంలో దాదాపు 200 నమూనాలను ప్రదర్శించారు. అలాగే విద్యార్థులకు క్విజ్ పోటీ, వ్యాసరచన పోటీ, గణిత శాస్త్ర అంశాలతో కూడిన ముగ్గుల పోటీలను నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ సుప్రసిద్ధ ప్రపంచ స్థాయి గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జన్మదినోత్సవాన్ని గణిత శాస్త్ర దినోత్సవంగా ఎంతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటున్నామన్నారు. ప్రాథమిక డిగ్రీలు లేకపోయినా గణిత శాస్త్రం పై మక్కువతో ప్రపంచ స్థాయి గణిత సిద్ధాంతాలను ప్రతిపాదించి ప్రపంచం చే శభాష్ అనిపించుకున్న గణిత శాస్త్ర మేధావి శ్రీనివాస రామానుజన్ అన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ సుధా నాయర్, పాఠశాల డాక్టర్ మోహన్ బాబు, డీన్ రాజశేఖర్ గణిత శాస్త్ర ఉపాధ్యాయులు ప్రసంగించారు. విద్యార్థులకు శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం సురేష్ అభినందనలు తెలియజేశారు.

గణితంపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మనిషి దైనందిక జీవితాన్ని ప్రభావితం చేసే గణిత శాస్త్రం పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రాజశేఖర్ రెడ్డి సూచించారు. స్థానిక కళాశాల ఆవరణలో సోమవారం శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. గణితం ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. గణిత శాస్త్రం మనిషి జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో విశదీకరించి చెప్పారు. అనంతరం క్విజ్ పోటీలను నిర్వహించి విజేతులకు బహుమతులను ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ కే.దీన దయాల్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నరసింహారావు, శైలజ, పద్మప్రియ, సాహితీ, సుమతి, డాక్టర్ నీరజ కుమారి, డాక్టర్ సాయి వందన, లక్ష్మి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ఫిలిం సొసైటీచే ప్రవీణ్ కు సత్కారం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఇటీవల సకల కళా వల్లభ అవార్డు స్వీకరించిన ఎలమంచిలి ప్రవీణ్ ను తిరుపతి ఫిలిమ్స్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ అందరూ ఏదో ఒక కళలో నిష్ణాతులై ఉంటారని, కానీ అన్ని కళలలో రాణించడం ప్రవీణ్ ప్రత్యేకత అని అన్నారు. ఫిలిం సొసైటీ అధ్యక్షులు వైయస్ బాబు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఆయనను వెన్నంటే గమనిస్తున్నానని, ప్రతి రంగంలో ఆయనకంటూ ఒక స్థానం సంపాదించుకున్నారని అన్నారు. ఫిలిమ్స్ సొసైటీ ప్రధాన కార్యదర్శి సి ఆర్ కే శేషగిరిరావు, కోశాధికారి యు.ప్రసాద్ రావు పాల్గొన్నారు.

'ఎస్వీబీసీ'లో నాణ్యమైన ప్రసారాలు : టిటిడి ఈవో

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులకు శ్రీవారి వైభవాన్ని, కైంకర్యాలను హెచ్ డీ ఛానల్ క్వాలిటీతో ఎస్వీబీసీ ఛానల్‌లో ప్రసారాలను అందించాలని అధికారులను టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆదేశించారు. టిటిడి పరిపాలనా భవనంలోని ఈవో ఛాంబర్‌లో అధికారులతో ఆయన సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఎస్వీబీసీ కార్యక్రమాలు మరింత నాణ్యంగా అందించేందుకు ఎస్వీబీసీ హెచ్‌డీ ఛానల్ అప్‌లింకింగ్ , డౌన్‌లింకింగ్ కోసం అదనపు ఉపగ్రహ బ్యాండ్‌విడ్త్ కేటాయింపునకు సంబంధించి కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖలకు అవసరమైన దరఖాస్తులు చేయాలని సూచించారు. హెచ్ డీ ఛానల్ నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా, ఎస్వీబీసీ ఛానల్ లో ఇప్పటి వరకు గంటకు స్పాన్సర్డ్ స్పాట్ లు 12 సెకన్లు మాత్రమే ఇస్తున్నారని, వాటిని 60 సెకన్ల వరకు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్వీబీసీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు స్విమ్స్ లో సాధారణ వైద్య చికిత్సలు, అరవింద్ ఐ హాస్పెటల్ లో కంటి వైద్య చికిత్సల కోసం మరో రెండేళ్లపాటు క్రెడిట్ వైద్య సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. టిటిడిలో అన్యమతస్తులపై చర్యలు తీసుకోవడంలో భాగంగా ఎస్వీబీసీలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న అవాద్ బిన్ మొహ్సిన్ సనాజీ, ఆఫీస్ సబార్డినేట్ గా పనిచేస్తున్న ఎం.డి. ఖైసర్ పాషాలు వారి రికార్డుల్లో ముస్లిం వర్గాలుగా నమోదైనందున వారి కాంట్రాక్ట్ గడువు ఈ నెలాఖరుతో ముగుస్తుందని, అనంతరం వారి సేవలను కొనసాగించరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీబీసీ బోర్డు సభ్యులు బీ. ఆనందసాయి, ఎం.ఎస్. రాజులు వర్చువల్ గా పాల్గొనగా, ఎస్వీబీసీ ఇంఛార్జి సీఈఓ డి. పణికుమార్ నాయుడు పాల్గొన్నారు.

స్థానికులకు 20వేల మందికి అవకాశం ఇవ్వండి

ప్రజాశక్తి - తిరుమల

'వైకుంఠ ద్వార దర్శనాల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వండి' అని కాంగ్రెస్ నేతలు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర హోంమంత్రి అనిత, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, రెవెన్యూ మినిష్టర్ అనగాని సత్యప్రసాద్‌లను కలిసి వినతిపత్రం అందించారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లోకాంగ్రెస్ నగర అధ్యక్షులు గౌడపేరు చిట్టిబాబు, పిసిసి ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఐరాల లోకేష్‌రెడ్డి, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలప దామోదర్‌రెడ్డి వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

కరెంటోళ్ల జనబాటను ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

'కరెంటోళ్ల జనబాట' ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) పరిధిలో 'కరెంటోళ్ళ జనబాట' కార్యక్రమాన్ని రాష్ట్ర ఇంధన శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం లాంచనంగా ప్రారంభించారు. తిరుపతి జిల్లా పాకాల మండలంలోని కష్ణాపురం గ్రామం వద్ద 'కరెంటోళ్ళ జనబాట'ను, మొగరాల గ్రామం వద్ద నూతనంగా నిర్మించిన 33/11 కెవి సబ్ స్టేషన్ ను ఏపీ ఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే కె. మురళీమోహన్ లతో కలిసి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలో వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసమే 'కరెంటోళ్ళ జనబాట' వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకునేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్ పై వినియోగదారుల్లో మరింతగా అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కష్ణాపురంలోని గ్రామస్తులతో మాట్లాడి విద్యుత్ వినియోగం, బిల్లుల చెల్లింపు, సేవలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.కారుణ్య నియామకాల కింద 50 మందికి ఉద్యోగ నియామక పత్రాలను మంత్రి చేతుల మీదుగా అందజేశారు.

మరింత ఉత్సాహంగా పనిచేద్దాం : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

అవార్డుల రాకతో బాధ్యత పెరిగిందని, అందరూ కలిసి కట్టుగా మరింత ఉత్సాహంగా పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. విద్యుత్ ఆదా చేయడంలో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచిన తిరుపతి నగరపాలక సంస్థ సెషా అవార్డు సాధించిన విషయం విదితమే. విజయవాడలో అవార్డును అందుకున్న డిప్యూటీ కమిషనర్ అమరయ్య సోమవారం కమిషనర్ ఎన్.మౌర్యకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అవార్డులు రావడంతో మనకు గుర్తింపుతో పాటు బాధ్యత పెరిగిందని అన్నారు. అధికారులు, సిబ్బంది కషి వల్లే అవార్డులు వస్తాయని అన్నారు. అందరం కలిసి కట్టుగా పనిచేస్తే తిరుపతి నగరపాలక సంస్థకు మరిన్ని అవార్డులు వస్తాయని తెలిపారు. అన్ని విభాగాల అధికారులు చక్కటి సమన్వయంతో పనిచేయాలని, భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, ఎలక్ట్రికల్ డి.ఈ. శిల్ప ఉన్నారు.

చర్మ సంరక్షణకు కేరాఫ్ 'సూర్య స్కిన్'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

చర్మ సంరక్షణకు కేరాఫ్ అడ్రస్‌గా సూర్య స్కిన్ అండ్ హెయిర్ హాస్పిటల్ నిలుస్తోందని ప్రముఖ డెర్మటాలజిస్ట్ డాక్టర్ తేజవతి తెలిపారు. స్థానిక కోట కొమ్మల వీధిలోని జెపి డెంటల్ హాస్పిటల్ వద్దనున్న సూర్య స్కిన్ అండ్ హెయిర్ హాస్పిటల్‌లో ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. చర్మ సంరక్షణ అనేది చాలా ముఖ్యమన్నారు. నేటి కాలంలో చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరిలో చర్మ సమస్యలు పెరిగిపోతున్నాయి. చర్మం శరీరంలోనే అతిపెద్ద అవయవం. శరీరం లోపల ఉండే భాగాలను రక్షించటం, శరీర ఉష్ణోగ్రతను నియంత్రించటం చర్మం ముఖ్యమైన పని అని తెలిపారు. శరీర పోషణకు అవసరమయ్యే నీరు, విటమిన్లు, కొవ్వును సైతం చర్మం నిల్వచేస్తుంది. చర్మంపై కెరాటిన్, ఫైబ్రొస్ ప్రోటీన్, లిపిడ్స్ వంటివి ఉండటం వల్ల హానికరమైన బాక్టీరియా, వైరస్ కారక క్రిములు శరీరంలోకి ప్రవేశించకుండా కాపాడుతుందన్నారు. అయితే కాలానుగుణ మార్పుల వల్ల మాత్రమే కాదు, ఆహారపు అలవాట్ల వల్ల కూడా చాలా మంది కొన్ని చర్మ సమస్యలను ఎదుర్కొంటున్నారు. చర్మం రంగు అనేది వారసత్వంగా రావచ్చుని, శరీరంలో చర్మ సమస్య మొదలైతే తొందరగా తగ్గకపోవచ్చున్నారు. చర్మ సమస్యలు వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించి, వారి సూచనలు మేరకు చికిత్స తీసుకుంటే చర్మాన్ని సంరక్షించుకోవచ్చు అన్నారు. తమ హాస్పిటల్ లో స్కిన్, హెయిర్ కు సంబంధించిన అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో, నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9666630626 ఫోన్ నెంబర్లు సంప్రదించాలని కోరారు.

ప్రత్యేకతలు......

- ✓ లేజర్ టాట్టూ రిమోవల్
- ✓ డెర్మారోల్లర్ ట్రీట్మెంట్.
- ✓ కెమికల్ పీల్స్
- ✓ మైక్రోడర్మాబ్రేషన్
- ✓ అడ్వాన్స్డ్ హెయిర్ లాస్ ట్రీట్మెంట్.
- ✓ స్టీమ్ సెల్ ఇంజక్షన్స్.
- ✓ జిఎఫ్ సి ట్రీట్మెంట్స్ ఫర్ హెయిర్.
- ✓ కార్బన్ ఫీల్ ఫర్ ఫేస్ రేజువినేషన్.
- ✓ ప్లేట్లెట్ రిచ్ ప్లాస్మా ట్రీట్మెంట్స్ (పిఆర్పి).
- ✓ అండర్ ఐ డార్క్ సర్కిల్ ట్రీట్మెంట్స్.
- ✓ ఆల్ కాస్మోటిక్ డెర్మటో సర్జరీస్.
- ✓ ఏంటిగింగ్ ట్రీట్మెంట్స్.
- ✓ బోట్స్ అండ్ ఫిల్లర్స్.
- ✓ కాస్మోటిక్ ఈర్ లాబ్ రిపేర్.
- ✓ స్ట్రెచ్ మార్క్ రిమోవల్ ట్రీట్మెంట్స్.
- ✓ లేజర్ ఫర్ అకనే బర్న్ అండ్ యాక్సిడెంట్ స్కార్స్.

జెపిలో దంత సమస్యలకు నాణ్యమైన వైద్యం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



అన్ని రకాల దంత సమస్యలకు సరికొత్త పరిజ్ఞానంతో కూడిన నాణ్యమైన వైద్య సేవలు జేపీ డెంటల్ హాస్పిటల్‌లో అందిస్తున్నామని ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ జయప్రసాద్.గెడ్డం తెలిపారు. స్థానిక దొడ్డాపురం, కోటకొమ్ముల వీధి లోని వినాయక స్వామి ఆలయం ఎదురుగా ఉన్న జేపీ డెంటల్ హాస్పిటల్ లో అయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ దంత సమస్యలు అంటే దంతక్షయం. చిగుళ్ల వ్యాధి, పంటి నొప్పి, సున్నితత్వం, దంతాలు ఊడిపోవడం, నోటి దుర్వాసన వంటివి. ఇవి ప్రధానంగా బ్యాక్టీరియా, ప్లాక్ పేరుకుపోవడం, సరిగా బ్రష్ చేయకపోవడం, గాయాలు, కొన్ని ఆరోగ్య సమస్యల వల్ల వస్తాయి, వీటిని నివారించడానికి మంచి నోటి పరిశుభ్రత (బ్రషింగ్, ఫ్లాసింగ్), క్రమం తప్పకుండా దంతవైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం అన్నారు. గత 30 సంవత్సరాలుగా దంత వైద్యంలో విశేష అనుభవం గడించి, వేలాది మంది రోగుల మన్ననలను పొందామన్నారు. సరికొత్త సాంకేతిక పరికరాలతో, విశేష అనుభవం గడించిన వైద్యులు, వైద్య సిబ్బంది ద్వారా, రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఎన్టీఆర్ వైద్య సేవ, ఈహెచ్ఎస్ హెల్త్ కార్డుల ద్వారా ఉచిత వైద్య టిటిడి ఏపీ స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ కు ఫీజు రియంబర్స్మెంట్ సౌకర్యం ఉందన్నారు. దంత సమస్యలను అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వివరాలకు 0877 2252526, 9502736361 ఫోన్ నెంబర్లు సంప్రదించాలని కోరారు.

ప్రత్యేకతలు

- ✓ పిక్స్ సిరామిక్ అండ్ జిరాకానియం బ్రిడ్జిస్
- ✓ డెంటల్ ఇంప్లాంట్స్
- కంప్లీట్ డెంచర్స్ (బిపిఎస్).
- ✓ అలిగనర్స్.
- ✓ రూట్ కెనాల్ ట్రీట్మెంట్.
- ✓ పేడోడొంటిక్ ట్రీట్మెంట్.
- ✓ విషడోమ్ టూత్ సర్జరీ.
- ✓ కాస్మోటిక్ స్మైల్ డిజైన్.
- ✓ అల్ట్రాసోనిక్ స్కాలింగ్.
- ✓ టీత్ వైటనింగ్.
- ✓ టీత్ కలర్డ్ ఫీలింగ్స్.
- ఆర్థోడెంటిక్ ట్రీట్మెంట్ (క్లిప్స్).

'జేపీ డెంటల్' ఉచిత వైద్య శిబిరం

మన అసోసియేషన్ అధ్యక్షులు గోపీనాథ్ అధ్యక్షతన, ట్రెజరర్ డి. గురునాథం జేపీ డెంటల్ హాస్పిటల్ సౌజన్యంతో మెగా మెడికల్ క్యాంపును పార్కు లో క్యాంటీన్ వద్ద నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపు నందు అధ్యక్షులు ఎం వెంకటరెడ్డి జాయింట్ సెక్రెటరీ రాజేశ్వరి , డాక్టర్ జయప్రసాద్ , డాక్టర్ తేజవతి , డాక్టర్ చంద్రశేఖర్ , డాక్టర్ కావ్య, డాక్టర్ జ్యోతి పాల్గొన్నారు. ఈ మెగా మెడికల్ క్యాంప్ నందు సుమారు 250 మంది పాల్గొన్నారు. పళ్ళ వ్యాధులు, చర్మ వ్యాధుల గురించి కూలంకుషంగా అవగాహన కల్పించారు. మన అసోసియేషన్ 2026 వ నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించారు.

పింఛన్ల మంజూరుకు పరిశీలన

ప్రజాశక్తి - వాకాడు: కొత్త పింఛన్లు మంజూరు చేసేందుకు పరిశీలన చేపట్టామని తహశీల్దారు, ఎంపీడీవో తెలిపారు. వాకాడు మండలం వాకాడు గ్రామం లోని మల్లెపూల సెంటర్ లోని షేక్ బాబు కదల లేని స్థితిలో ఉండగా అతని పింఛను మంజూరు నిమిత్తం ఎంపీడీఓ సాయి ప్రసాద్, తహశీల్దారు సయ్యద్ ఇక్బాల్‌లు వారి ఇంటి వద్దకు వెళ్లి పరిస్థితులు పరిశీలించి పింఛను మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు పోలీస్ స్టేషన్‌ను డిఎస్‌పి గీతా కుమారి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ రికార్డ్స్, మెయింటెనెన్స్, పోలీస్ స్టేషన్ పరిశుభ్రత గురించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ తనిఖీలో వాకాడు సబ్ ఇన్‌స్పెక్టర్ నిఖిల్ బాబు , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 412 అర్జీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జిల్లా నలుమూలల నుండి సమస్యల పరిష్కారం కోసం వచ్చే అర్జీదారుల సమస్యలు సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేందర్ రెడ్డి, రోజ్ మాండ్ తో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి 201, పంచాయతీరాజ్ 57, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 18, హోమ్ 30, సెర్ప్ 13, సర్వే శాఖ 14, ఫ్యామిలీ వెల్ఫేర్ 12, హౌసింగ్ 10 అర్జీలు మొత్తం కలిపి 412 వచ్చినట్లు అధికారులు ప్రకటించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 33 వినతులు

నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 33 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 18 మంది కార్యాలయానికి నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 13 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్లు తులసి కుమార్, గోమతి ఉన్నారు.

శివమణికి నివాళులు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): మండలంలోని పొయ్య పంచాయతీలో గత 10 సంవత్సరాలుగా హరిత రాయబారిగా పని చేస్తున్న శివమణి అనారోగ్య కారణంతో సోమవారం మృతి చెందారు. ఈ సంగతి తెలియగానే పొయ్య పంచాయతీ సర్పంచ్ సమ్మలయ్య కుమారుడు మణి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. శివమణి కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిమిత్తం పదివేల రూపాయలు సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుని భార్య మారెమ్మ ఆరుగురు పిల్లలు ఉన్నారని వీరి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఎన్‌సిసిలో విద్యార్థినులు ఉత్తీర్ణత

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల2023–2025 బ్యాచ్ కు చెందిన 77 మంది పదవ ఆంధ్ర మహిళా బెటాలియన్ విద్యార్థినులు రెండు సంవత్సరాల ఇంటర్మీడియట్ విద్యతోపాటు ఎన్‌సిసి శిక్షణలో బి సర్టిఫికెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి నేతృత్వంలో ఎన్‌సిసి విద్యార్థినులకు కల్నల్ అజయ్ వాద్వా భూపతి, ఎన్, కె జహంగీర్ బి సర్టిఫికెట్స్ ని అందజేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ క్యాడెట్స్‌ను ఉద్దేశించి భవిష్యత్తులో భారతదేశ రక్షణలో మీ వంతు పాత్రను పోషించడానికి ఇది ఒక చక్కని అవకాశమని, బిఎస్‌ఎఫ్ సిఐఎస్‌ఎఫ్ సిఆర్పిఎఫ్ ఎస్ ఎస్ బి మొదలైన వాటిల్లో బోనస్ మార్కులను పొందుతారన్నారు. నౌకాదళం, వైమానిక విభాగాల్లో కూడా ఈ రోజుల్లో మహిళలు రాణిస్తున్నారని ఈ అవకాశాల్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్రానికి, భారతదేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి ఇంచార్జ్ అధ్యాపకురాలు డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

పంచాయతీ విభజనకు గ్రామసభ ఆమోదం

ప్రజాశక్తి-బాలాయపల్లి: మండలంలోని పిగిలాం పంచాయతీలోని జార్లపాడు, కొత్తపల్లి గ్రామాలను పంచాయతీగా విభజించాలని జార్లపాడు గ్రామానికి చెందిన ముప్పాళ్ళ మాధవనాయుడు వినతితో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిప్యూటీ ఎంపిడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ప్రజల అభిప్రాయాలను కోరుతూ ఓటింగ్ నిర్వహించారు. గ్రామసభకు హాజరైన 102 మంది అంగీకారం తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపిడీవో మాట్లాడుతూ ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాలంగా లక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు అశోక్ రెడ్డి, దయాకర్, రెవెన్యూ నాయకులు ముప్పాళ్ళ మాధవనాయుడు, గోపాల్ యాదవ్, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

గుడిమల్లం ఆలయ పాలకమండలి సమావేశం

ప్రజాశక్తి - ఏర్పేడు : నూతన పాలకమండలి సమావేశం ఆలయ వసతి గృహంలో సోమవారం నిర్వహించారు. నూతన పాలకమండలి సామాన్య భక్తులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆమోదించారు. మాస ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామికి అభిషేకం చేసి ప్రాకారోత్సవం చేయాలని తీర్మానించారు. చైర్మన్ బత్తల గిరిబాబు, సభ్యులు టి బాబు, పి అరుణ, టి హంస, జి గీత, బి రాజ్ కుమార్, టి రేవతి, ఏ ఉష, ఆర్ కిరణ్ కుమార్, కె నిరంజన్ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేయండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు – గిద్దలూరు రోడ్డుకు మరమ్మతులు చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంట శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2014వ సంవత్సరం శ్రీకారం చేసిన రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో 15 గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ప్రతి రోజు దాదాపు 7 వేల మందికి పైగా ఈ రోడ్లలో రాకపోకలు సాగిస్తుంటారని వారందరూ రోడ్డు సరిగా లేని కారణంగా ప్రమాదాలకు గురవుతున్నారని వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుకు అర్జీ సమర్పించగా రూ.4 కోట్ల 50 లక్షలతో రోడ్డు మరమ్మతు పనులు చేసినట్లుగా తమకు చెప్పారన్నారు. ఈ నిధులు ఏమయ్యాయో చెప్పాలని నిలదీశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రామకృష్ణ , సుబ్బరాజు, వేమయ్య పాల్గొన్నారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు బిఎన్ కండ్రిగ విద్యార్థి

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాలెంలో ఈ నెల 16,17,18 వ తేదీలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో తిరుపతి జిల్లాజట్టు ప్రథమ స్థానంలో గెలుపొందింది. అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థి బి చిమిత్ హిమాచల్ ప్రదేశ్‌లో జనవరి 5వ తేదీ నిర్వహించనున్న జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విజయానికి అహర్నిశలు శ్రమించిన వ్యాయామ దర్శకులు, మ్యాజిక్ బస్సు ప్రతినిధులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె రమణయ్య, వ్యాయామ దర్శకులు ఈ మస్తానయ్య, యస్ హరిబాబు, మేజిక్ బస్సు బి రాంబాబు , ఇతర ఉపాధ్యాయులు, ఆ విద్యార్థిని అభినందించారు.

పరీక్షా సామగ్రి వితరణ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నెలవాయిలో పదవ తరగతి విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీ కాళహస్తికి చెందిన టివి రమణ రావు జ్ఞాపకార్థం వారి మనవరాలు టివి ఆద్య సౌజన్యంతో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దాత టివి రాజేష్, మిత్రులు సి హేమంత్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కె మురళీమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో విద్యార్థుల మేధస్సు పెరగాలి: ఎంఈవో

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని అన్ని పాఠశాలల్లో వంద రోజుల్లో విద్యార్థుల మేధస్సు మెరుగుపడాలని ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. రోజువారీ ప్రణాళిక ప్రకారం ప్రతిరోజు ఉదయం ఒక పాఠ్యాంశాన్ని రెమెడియల్ క్లాసులు, మిగిలిన గంటల్లో ప్రధాన సబ్జెక్టులపై దృష్టితో ఏకాగ్రత పెంపొందించాలని రెండవ ఎంఈవో ఆవల మునిసుబ్రహ్మణ్యం తెలిపారు. మండల కేంద్రంలోని బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా హిందీ పరీక్ష రెండవ మండల విద్యాశాఖ అధికారి పరిశీలించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఈ సాధన సహాయపడుతుందన్నారు. పదిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రథమ, ద్వితీయ స్థానాలకు తీసుకురావడానికి ప్రత్యేక ప్రణాళికల ద్వారానే సాధ్యమన్నారు.

గూడూరును జిల్లా చేయాలి

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని పెద్ద మసీదు నుండి ఆల్ ఇండియా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ యునైటెడ్ ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి గూడూరును జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. గూడూరును జిల్లా చేయాలని లేని పక్షంలో నెల్లూరు జిల్లాలో కలపాలని నినాదాలతో పట్టణంలో ర్యాలీ చేశారు. టవర్ క్లాక్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. ఫోరం ఉపాధ్యక్షులు తలకొండయ్య నిరసన తెలిపారు. అనంతరం జేఏసీ కన్వీనర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఫోరం జాతీయ అధ్యక్షులు డేవి రవి రాఘవేంద్ర మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను తెలుసుకోకుండా గూడూరును తిరుపతి జిల్లాలో కలిపారని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు, లోకేష్ ఇచ్చిన హామీ మేరకు హామీని నెరవేర్చాలని లేకపోతే ప్రజల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ దశరథరామిరెడ్డి, మక్తాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పుత్తూరులో సబ్ జైలు నిర్మించండి

హోంమంత్రికి టిడిపి నాయకుల వినతి

హోం మంత్రికి వినతిపత్రం ఇస్తున్న పోతుగుంట విజయబాబు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పట్టణంలో సబ్ జైలు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పోతు గుంట విజయబాబు మాట్లాడుతూ. పుత్తూరులో సబ్ జైలు నిర్మాణ విషయమై చర్యలు చేపట్టాలని కోరారు. అప్పటికప్పుడే జైలు అధికారులకు ఫోన్ చేసి హోమ్ మంత్రి ఆదేశాలు జారీ చేశారన్నారు. పుత్తూరు పట్టణ శివారులో ఆధునాతనంగా జైలు నిర్మించేందుకు 2011లో అప్పటి ప్రభుత్వం నందిమంగళం రెవెన్యూ లెక్క దాఖలాలలో నూతన జైలు భవన నిర్మాణానికి రెండుఎకరాలు కేటాయించిందని తెలిపారు. సుమారు 5 కోట్ల రూపాయలు బడ్జెట్‌తో నిర్మించాలని అనుకున్నారని అయితే ప్రారంభ దశలోనే ఆగిపోయిందన్నారు. ప్రస్తుతం ముద్దాయిలను 70 కిలోమీటర్ల దూరంలోని సత్యవేడు, శ్రీకాళహస్తి జైళ్లకు తీసుకెళ్తున్నారు. ఖైదీల బందోబస్తు కోసం పోలీస్ సిబ్బందికి దీని వల్ల చాలా ఇబ్బంది ఎదురవుతోందని వెంటనే జైలును ఏర్పాటు చేయాలని కోరారు.

రోబోటిక్ సర్జరీపై సదస్సు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఫోర్టిస్ నెట్‌వర్క్‌కు చెందిన ప్రముఖ వైద్య సంస్థ గ్లెనీగల్స్ హాస్పిటల్ చెన్నై, గైనకాలజీ రంగంలో మరో చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. 'రోబోటిక్స్ ఇన్ గైనకాలజీ: ది న్యూ స్టాండర్డ్' పేరుతో నిర్వహించిన కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ సదస్సు తిరుపతిలోని హోటల్ రెన్నెస్‌లో విజయవంతంగా నిర్వహించారు. తిరుపతి అబ్స్టెట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీ, శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజ్ ప్రసూతి విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి 40 మందికి పైగా గైనకాలజిస్టులు హాజరయ్యారు. రోబోటిక్ శస్త్రచికిత్సలో కొత్త దిశానిర్దేశం ప్రధాన వక్తగా గ్లెనీగల్స్ హాస్పిటల్ చెన్నై ప్రసూతి, గైనకాలజీ, ఫర్టిలిటీ మెడిసిన్, రోబోటిక్ సర్జరీ, యుటెరైన్ ట్రాన్స్‌ప్లాంట్ విభాగాల డైరెక్టర్ డాక్టర్ పద్మప్రియ వివేక్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోబోటిక్ సాంకేతికత క్యాన్సర్, పెద్ద పరిమాణ ఫైబ్రాయిడ్లు వంటి క్లిష్టమైన కేసుల్లో కూడా సురక్షితంగా నిర్వహించవచ్చని వివరించారు. చెన్నైలో నిర్వహించిన ఒక అరుదైన కేసు వివరాలను ప్రదర్శించారు. ఆ కేసులో 4.95 కిలోల (దాదాపు 5 కిలోల) భారీ ఫైబ్రాయిడ్‌ను రోబోటిక్ సహాయంతో తొలగించారన్నారు. ఈ విజయాన్ని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌కు సమర్పించారు. రోబోటిక్ పద్ధతిలో ఈ శస్త్రచికిత్స ద్వారా అధిక రక్త స్రావం లేకుండా సర్జరీ పూర్తి చేసిందన్నారు. రోగి 24 గంటల్లో చలనం పొందారు. శరీరంలోని సున్నితమైన ప్రాంతాల వద్ద ఖచ్చితత్వంతో సాధ్యమైంది. ప్రాంతీయ వైద్యులకు ప్రేరణాత్మకంగా ప్రారంభించిన డాక్టరు ఉమాదేవి, కార్యదర్శి, ప్రపంచస్థాయి శస్త్రచికిత్సా ప్రమాణాలను స్థానిక వైద్య సమాజానికి పరిచయం చేయడం ముఖ్యమన్నారు. డాక్టర్ జి పార్థసారధి రెడ్డి, డాక్టర్ పద్మప్రియ వివేక్ మాట్లాడుతూ 'రోబోటిక్ సర్జరీ భవిష్యత్ కాదు, ఇది ఇప్పటికే మహిళల ఆరోగ్య సంరక్షణలో కొత్త ప్రమాణంగా నిలిచిందని, తమ అనుభవాలను పంచుకోవడం ద్వారా తిరుపతి ప్రాంతంలోని రోగులకు ప్రపంచ స్థాయి చికిత్సలను అందించడమే తమ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

కలెక్టర్‌కు ఎమ్మెల్యే వినతి

కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పిచ్చాటూరు: నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి సహకరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్లును సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. సోమవారం ఉదయం తిరుపతి కలెక్టర్ కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకుని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాగలాపురంలోని పాడుబడ్డ పాత ప్రభుత్వ జూనియర్ కళాశాలను తొలగించాలని కోరారు. నాగలాపురంలో మండల సమాఖ్య భవనాన్ని నిర్మిస్తే వెలుగు, ఉపాధి హామీ కార్యాలయాలకు భవనం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. పిచ్చాటూరులో పశువుల విడిది కోసం ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సత్కారం

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్. : చిత్తూరు పార్లమెంటరీ టిడిపి అధ్యక్షులుగా నియమితులైన సి షణ్ముగం రెడ్డి నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌ను టిడిపి కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద గజమాలతో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అందరితో కలిసికట్టుగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ డిఎస్ గణేష్, ఎస్‌టి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చెంచయ్య, నగరి నియోజకవర్గ టిడిపి తెలుగు యువత ప్రధాన కార్యదర్శి శ్రీరామ్, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పేరు మార్పుపై నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్షాల నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ప్రస్తుత బిజెపి ప్రభుత్వం మార్పు చేయడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో పుత్తూరు తహశీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు ఆర్ వెంకటేష్. సిపిఐ పుత్తూరు డివిజన్ కార్యదర్శి డి మహేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధి హామీ చట్టాన్ని పేరు మారుస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా పేరు మార్చి 120 రోజులు పని దినాలు కల్పిస్తామని పార్లమెంటులో బిల్లు ప్రవేశ పెట్టడం అన్యాయమన్నారు. గతంలో వలే 200 రోజులు పని దినాలు కల్పించాలని ఒకరోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని పని ప్రదేశంలో కూలీలకు అన్ని వసతులు కల్పించాలని కోరారు. వెంటనే పేరు మార్పును ఉపసంహరించుకోకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దేశమ్మ, రాఘవమ్మ, కాంతారావు, సిపిఐ నాయకులు కృష్ణారెడ్డి, సర్వనా, వెంకటయ్య పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు పోలీసు శాఖ వెన్నెముక

ప్రజాశక్తి -చంద్రగిరి: చంద్రగిరి మండలం కళ్యాణి డ్యామ్ వద్ద వున్న పోలీసు శిక్షణ కళాశాలలో కొత్తగా ఎంపికైన కానిస్టేబుళ్లకు విజయవాడ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎం రవి ప్రకాష్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రవి ప్రకాష్ మాట్లాడుతూ కానిస్టేబుళ్లే పోలీసు శాఖకు వెన్నెముక అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కానిస్టేబుళ్ల భుజస్కంధాల మీదే ఆధారపడి ఉంటుందని ఐజి చెప్పారు. తొమ్మిది నెలలపాటు పొందే శిక్షణలో శారీరక దృఢత్వం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడంపై దృష్టి సారించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించిన వారు వృత్తిలో సమర్థవంతంగా రాణించే అవకాశం ఉంటుందన్నారు. బాధ్యతతో విధులు నిర్వర్తిస్తూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. సానుకూల ఆలోచనలు, ఆరోగ్యకరమైన తీర్చుదిద్దుకోవాలని, ప్రతి ఒక్కరూ హుందాగా వ్యవహరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిటిసి ప్రిన్సిపాల్ కే సుబ్రహ్మణ్యం, అసెంబ్లీ ట్రైనర్స్, పిటిసి సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు

ప్రజాశక్తి - క్యాంపస్ : బంజారా జన్ సంగ్ సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి మహానగరంలో అన్నమయ్య సర్కిల్ కూడలి దగ్గర గిరిజన భవనంలో జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు మూడు రోజులు భాగంలో మూడవ రోజు ఘనంగా సంస్థ అధ్యక్షులు మూడే హరి చౌహన్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హరి చౌహన్ నాయక్ మాట్లాడుతూ మన భారతదేశంలో సంస్కృతి సంప్రదాయాలకు చాలా గొప్పవని, సంస్కృతి సంప్రదాయం నుంచి మనం ఎంతో నేర్చుకోవచ్చని, భారత దేశంలో ఎన్నో విషయాలు సంస్కృతి సంప్రదాయాల నుంచే పుట్టాయని వివరించారు. బంజారా సంస్కృతి సంప్రదాయాల కోయ నృత్యం, దింసా నృత్యం, కథాకళి నృత్యం, కొండరెడ్ల నృత్యం కళ్యాణం , కథాకళి కోలాటాలు, మొదలైన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా గిరిజనుల పెద్దలు, గిరిజన సీనియర్ నాయకులు ప్రియాంక నాయక్ , వెంకటరమణ నాయక్ పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన పరుచూరి

ప్రజాశక్తి- వెంకటగిరి: వెంకటగిరి సమీపంలోని వల్లి పేరు 9వ పోలీస్ బెటాలియన్ ను పరిశీలించేందుకు సోమవారం వచ్చిన ఎస్పీ సుబ్బరాయుడును రాష్ట్ర బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ పరుచూరి పెంచల నరసయ్య మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ చైర్మన్ పరుచూరి మాట్లాడుతూ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అభ్యున్నతికి, అసోసియేషన్ క్రీడాకారులను ప్రోత్సహించేలా ఎస్పీ సహకారం అందించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని ఇది శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ ఏవి రమణ, పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

బిజెపి ఎన్నికల కమిషన్‌గా మార్పు : యార్లపల్లి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): భారత ఎన్నికల కమిషన్ బిజెపి ఎన్నికల కమిషన్‌గా మారిందని కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు యార్లపల్లి గోపిగౌడ్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ గుమ్మడికాయల దొంగ ఎవరంటే ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కూటమి నాయకులు భుజాలు తడుముకుంటున్నారన్నారు. 2019లో అధికారం పోగానే ఈవిఎంల ట్యాంపరింగ్ జరిగిందని చంద్రబాబునాయుడు గగ్గోలు పెట్టారని గుర్తు చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజాస్వామ్యాన్ని, న్యాయ వ్యవస్థను, భారత ఎన్నికల కమిషన్‌ను సర్వనాశనం చేశారని విమర్శించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రవి, వెంకటేష్ గౌడ్, నాగరాజు యాదవ్, కుమార్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

కారు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కారు ఢీ కొట్టి ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన శ్రీకాళహస్తి పట్టణంలోని పాత బైపాస్ రోడ్డు ఎస్ వి ఎస్ కళ్యాణ మండపం వద్ద సోమవారం చోటు చేసుకుంది. టూ టౌన్ పోలీసుల కథనం మేరకు తొట్టంబేడు మండలంలోని పిల్లమేడు గ్రామానికి చెందిన వెంకటరమణ(50) ఉద్యోగరీత్యా తిరుపతిలో నివాసం ఉంటున్నాడు. సోమవారం సొంత పనుల నిమిత్తం స్వగ్రామమైన పిల్లమేడుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. ఈ క్రమంలో ఎస్ వి ఎస్ కళ్యాణమండపం వద్ద తిరుపతి నుంచి గుంటూరు వెళుతున్న కారు వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో వెంకటరమణ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. టూ టౌన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

ఆటో బోల్తా

విద్యార్థినికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): షేర్ ఆటో బోల్తా పడి విద్యార్థినికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని కొత్త కన్నలి ఎస్టీ కాలనీ సమీపంలో నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి పట్టణం నుంచి ప్రయాణికులు, విద్యార్థులతో మండలంలోని లింగమనాయుడు పల్లి పంచాయతీ దొమ్మర మిట్ట గ్రామానికి బయలుదేరిన షేర్ ఆటో కొత్తకన్నలి సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ప్రవళ్ళిక(10) తీవ్రంగా గాయపడింది. ఇద్దరు ప్రయాణికులు, ముగ్గురు విద్యార్థులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. గాయపడ్డ ప్రవళ్ళికను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందంటూ వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. ప్రవళ్ళిక శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ ప్రముఖ ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. ఘటనపై టూ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సబ్ స్టేషన్ నిర్మాణానికి టెండర్లు పిలవాలి

విద్యుత్ శాఖ మంత్రికి ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి -పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం ముడియూరులో ప్రభుత్వం మంజూరు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కోరారు. సోమవారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఇంటికి విచ్చేసిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలుసుకొని ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం అక్కడే ఉన్న విద్యుత్ శాఖ సీఎండీ శివశంకర్ ను కలిసి ముడియూరులో సబ్ స్టేషన్ ఆవశ్యకతను వివరించి వెంటనే టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని విన్నవించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ తో పాటు సీఎండీ శివశంకర్ సానుకూలంగా స్పందించినట్లు, సబ్ స్టేషన్ కు టెండర్లు పిలవడానికి సుముఖంగా ఉన్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వెల్లడించారు.

చంద్రగిరి సిద్ధార్థ స్కూలు విద్యార్థులకు

స్వర్ణ, రజత, కాంస్య పతకాలు

ప్రజాశక్తి- చంద్రగిరి: రాక్ ఫైటర్స్ తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయంలో ఇంటర్స్కూల్స్ తైక్వాండో పోటీలు' పోటాపోటీగా నిర్వహించారు. తిరుపతి, పరిసర ప్రాంతాలలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుండి సబ్ జూనియర్, జూనియర్, క్యాడెట్, సీనియర్ విభాగాల్లో దాదాపు వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో చంద్రగిరికి చెందిన స్థానిక సిద్ధార్థ ఇంగ్లీషుమీడియం స్కూలు పిల్లలు వారి తైక్వాండో 'కోచ్ ఆధ్వర్యంలో సుమారు 80 మందికి పైగా పాల్గొన్నారు. వీరిలో 72 మందికి పైగా వివిధ విభాగాలలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకోవడమే కాక 'ఓవరాల్ ఛాంపియన్‌షిప్' కైవసం చేసుకుందని స్కూల్ కరస్పాండెంట్ జి.రామకృష్ణమూర్తి, హెడ్మాస్టర్ , డైరెక్టర్ ఎమ్ నవచంద్రబాబు తెలిపారు. విజేతలందరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకడెమిక్ ఇన్‌ఛార్జి సింధు, మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెంగాలమ్మ సేవలో ఇస్రో చైర్మన్

ప్రజాశక్తి -సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ డిసెంబర్ 24న బుధవారం ఎల్వీఎం3 ఎం6 బ్లాక్2 ఉపగ్రహ ప్రయోగం జరగనున్న నేపథ్యంలో ప్రయోగం విజయవంతం కావాలని సోమవారం సూళ్లూరుపేట లోని చెంగాలమ్మ పరమేశ్వరి దేవి ఆలయాన్ని దర్శించుకున్నారు. వారిని సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి బి. ప్రసన్నలక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అనంతరం వేద పండితులచే అమ్మవారికి పూజలు నిర్వహించారు.

ముక్కంటి సేవలో..

శ్రీకాళహస్తి: ఇస్రో చైర్మన్ నారాయణన్ సోమవారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయాధికారులు సంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల వద్ద ప్రత్యేక పూజలు చేసుకున్నారు. మంగళవారం శ్రీహరికోట షార్ నుంచి నింగిలోకి దూసుకుపోయే ఎల్వీఎం–6 బ్లూ బర్డ్ రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని ఆదిదంపతుల వద్ద పూజలు చేసినట్లు ఇస్రో చైర్మన్ తెలిపారు.

పద్మావతి పాలిటెక్నిక్ కళాశాలలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: శ్రీ పద్మావతి పాలిటెక్నిక్ కళాశాలలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌కు తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనం చేసి స్పోర్ట్స్ టార్చ్ వెలిగించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో క్రీడలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టుతో అంకితభావం పెరుగుతుందన్నారు. తాను కుప్పం పాలిటెక్నిక్ కాలేజీలో చదువుకునే సమయంలో క్రీడల్లో పాల్గొని విద్యార్థిసంఘం నాయకునిగా ఉన్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఎఈఎస్‌ఓ రాంకుమార్, ఆర్‌జెడి నిర్మల్‌కుమార్ ప్రియ, పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి

బుచ్చినాయుడు కండ్రిగ: సోమవారం గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి ని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు వాణి ఆధ్వర్యంలో గణిత ఉపాధ్యాయులు సురేష్ బాబు ఘనంగా నిర్వహించారు. వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్యాడ్, జామెంట్రీ బాక్స్, స్కేల్ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు యువశ్రీ మురళి, లక్ష్మయ్య, మాధవీలత, సుజన, రమేష్ పాల్గొన్నారు.

పుత్తూరులో

పుత్తూరు టౌన్ : శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని డాక్టర్ బి. చంద్రమౌళి అన్నారు. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గణిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గణిత శాస్త్ర విభాగ అధ్యక్షులు డాక్టర్ పి గాయత్రి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మన్యం నరసింహులు, డాక్టర్ పి సుజన, డాక్టర్ సురేష్, డాక్టర్ శంకరరావు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రగిరి: మండలంలోని రంగంపేట గ్రామంలోని ఆర్‌కెఎస్ నెక్స్ట్ జెన్ స్కూలులో జాతీయ గణిత దినోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఉత్సాహభరిత పాల్గొనడంతో ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఆర్‌కె విమల, అకాడమిక్ డైరెక్టర్ శివ కుమార్ రెడ్డి , బాబురెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. నెక్స్ట్ జెన్ స్కూల్‌లోని వినాయక క్యాంపస్, వీక్షా క్యాంపస్‌లలో విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిరం పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ పుట్టిన రోజు సందర్భంగా మ్యాథమెటిక్స్ డేలో భాగంగా విద్యార్థులు అనేక రకాల మ్యాథమెటిక్స్ యాక్టివిటీస్ చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు మల్లెమాల మురళి రెడ్డి, పాఠశాల కార్యదర్శి డాక్టర్ బండి శ్యామసుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్), పాఠశాల కోశాధికారి రావూరు రవిచంద్ర పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానాచార్యులు వి రంగనాయకులు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సి ప్రకాష్ బాబు అధ్యక్షతన గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల గణిత అధ్యాపకులు కె సోమశేఖర్, సి రేవతి, ఎస్ మహేశ్వరీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టరు వి ప్రసన్న లక్ష్మీ, ఏకె బాలాజి, చంద్రికా భాయి, ఎమ్ యశోద, డాక్టరు సి వాసుదేవులు నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాంపస్ : తిరుపతిలోని ఆర్కేఎస్ నెక్స్ట్ జెన్ స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల డైరెక్టర్ ఆర్కే విమల, అకాడమిక్ డైరెక్టర్ శివకుమార్ రెడ్డి, బాబురెడ్డి, వినాయక క్యాంపస్, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రగిరి: స్థానిక శ్రీ పద్మావతి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర దినోత్సవం సందర్భంగా ఎంఈవో ఎస్ లలిత కుమారి ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎ రంగంపేట 'గణిత శాస్త్ర అష్టావధానం' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంకట రమణారెడ్డి, మందన్మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చంద్రగిరిలో

క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం, డిపార్ట్మెంట్ ఆఫ్ అప్లైడ్ మాథెమాటిక్స్ జాతీయ గణిత దినోత్సవం ఎంతో ఘనంగా నిర్వహించారు. డిపార్టుమెంట్ ఇన్‌చార్జి హెడ్ డాక్టరు ఎం శివ పార్వతి, ఉపాధ్యాయులు డాక్టరు బి విశాలి, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ – 1 ప్రోగ్రామ్ ఆఫీసర్ పాల్గొన్నారు.

క్యాంపస్ : ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం పరుగులు పెడుతున్న తరుణంలో క్లౌడ్ కంప్యూటింగ్ రంగంలో గణిత ఆవర్తనాల ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకళాపతి ఆచార్య జిపి రాజశేఖర్ పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ 138 వ జయంతిని పురస్కరించుకొని సోమవారం విభాగం సెమినార్ హాల్లో ఘనంగా ప్రారంభించారు. రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడులు, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆచార్యులు కె. శోభలత, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పద్మావతమ్మ, సదస్సుకు కన్వీనర్‌గా వ్యవహరించిన ఆచార్య సి. జయసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా, నా క్లయింట్ బి. రాము తండ్రి లేట్ బి.గుర్రప్ప సూచనల మేరకు బహిరంగ ప్రకటన

దిగువ పేర్కొన్న షెడ్యూలు ఆస్తి నా క్లయింట్ బి. రాము గారి తండ్రి లేట్ బి.గుర్రప్ప కు **డాక్యుమెంట్ నెం.336/1987** ద్వారా పొంది అతని తదనాంతరం కుటుంబ సభ్యుల నుండి హక్కు విడుదల పత్రం నెం.2671/2023 ద్వారా హక్కు కలిగి ఉన్నారు. ఈ ఆస్తికి సంబంధించిన ఓరిజనల్ లింక్ డాక్యుమెంట్ నెం.336/1987 ను పోగొట్టుకున్నందున నకలు కాపీ తో లావాదేవిని జరుపదలచారు. కావున క్రింద పేర్కొన్న షెడ్యూలు ఆస్తి పై ఎటువంటి అక్షేపణలు, ఆరోపణలు ఎవరికైనను ఉన్న ఎడల ఈ ప్రకటన ప్రచురించిన తేది మొదలు ఏడు (7) దినముల లోపల క్రింద తెలిపిన అడ్రస్సు కు తెలియపరచవలసినదిగా తెలియజేయడం అయినది.

షెడ్యూలు

తిరుపతి జిల్లా– తిరుపతి రిజిస్ట్రేషన్ జిల్లా, తిరుపతి, తిరుపతి రూరల్ సబ్–డి. తిరుపతి రూరల్ మండలం– 2 వ వార్డుకు చేరిన దళితవాడ రెసిడెన్షియల్ ఏరియాలో, నెం.49 అవిలాల గ్రామలెక్కదాఖలా, సర్వే నెం. 406/1, 405/3ఎకర్లులో,
తూర్పు: వెల్లూరు నారాయణ స్వామి గారి జాగా
పడమర : షేక్ అబ్దుల్ గఫూర్ గారి జాగా **ఉత్తరం:** రోడ్డు
దక్షిణం:కె.శ్రీనివాసులు గారి జాగా
ఈ నాలుగు హద్దుల మధ్యన గల **తూర్పు పడమర :** అ.30 **ఉత్తరం దక్షిణం :** అ.50 మొత్తం 1500 చ॥అ॥ లేక 166.66 చ॥గ॥ గల జాగా ఇందులో 1/5 వ భాగం పోను మిగిలిన 4/5వ భాగం 133.33 చ.గ.ల జాగా.

SINDHUJA BHOJANALA, M.A.LL.M.,
Advocate., Tirupati. Cell: 9573721319

నోటీసు ప్రకటన
మహారాజశ్రీ చీరాల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో..
H.M. O. P 67/2023

యడ్లపల్లి ఉరఫ్ వంకా బిందు మాధురి ...పిటిషనర్
V/s
యడ్లపల్లి వంశీ కృష్ణ ...రెస్పాండెంట్

To,
యడ్లపల్లి వంశీ కృష్ణ
S/o వై.వి.జనార్దన రావు, సాఫ్ట్ వేర్ ఇంజనీర్,
డోర్ నెం. 13–7–88/40,కోర్లగుంట తిరుపతి (అర్బన్) ఆంధ్రప్రదేశ్.

పై నెంబర్‌లో పిటిషనరు మీతో కలసి కాపురము చేయుటకున్నూ, వివాహ బంధము కొనసాగించుటకు వగయిరా పరిహారములు కోరుచు హిందూ వివాహ చట్టం 1955 సెక్షన్ 9 ప్రకారం పరిహారము కోరుచు పిటిషన్ దాఖలు చేసియున్నారు. మీరు కోర్టుకు 29–12–2025వ తేది ఉదయం గం. 10:30 నిముషాలకు మీరు స్వయముగాని లేదా వకీలు గారి ద్వారా గాని కోర్టువారి ఎదుట హాజరయి మీకు అభ్యంతర ములు ఉన్న యెడల తెలుపుకొనవలసినన్ని లేని యెడల మీపరోక్షమందు కేసును తీర్మానించబడునని తెలియజేయడమైనది.

ఇట్లు,
M.V CHALAPATHI RAO,
Advocate,
Paparajuthota,
CHIRALA-523155 (A.P.)
Ph: 9985854833

జాతీయ టెన్నిస్ కోర్టు ప్రారంభం

ప్రజాశక్తి -చిల్లకూరు: ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టెన్నిస్ కోర్టును గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టరు పాశం సునీల్ కుమార్ సోమవారం ప్రారంభించారు. మహిళా ఆల్ ఇండియా టెన్నిస్ కోర్ట్ చిల్లకూరు మండలంలోని భూధనం గ్రామసమీపంలో ఏర్పాటు చేశారు.

నెల్లిపూడి టిడిపి ఇన్‌ఛార్జిగా హరీష్ నాయుడు

ప్రజాశక్తి -వాకాడు: వాకాడు మండలం నెల్లిపూడి పంచాయతీ టిడిపి ఇన్‌చార్జిగా కల్లూరు హరీష్ నాయుడు నియమితులయ్యారు. సార్వత్రిక ఎన్నికల ముందు టిడిపిలోకి ప్రవేశించిన నాయుడు ఆ ఎన్నికలలో క్రియాశీలకంగా వ్యవహరించారు. మండల పరిధిలోని అందరు నాయకులతో సత్సంబంధాలతో నెల్లిపూడి పంచాయతీ ప్రజలతో తన పూర్వీకులతో ఉన్న అనుబంధాన్ని మరోసారి మెరుగు పరుచుకుంటూ, మండల టిడిపి నాయకులలో క్రియాశీలకమైన నాయకుడుగా ఎదుగుతున్న హరీష్ నాయుడు సేవలను గుర్తించిన టిడిపి అధిష్టానం ఆయనకు ఆ పంచాయతీ బాధ్యతలను అప్పగించినట్లు సమాచారం. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ పంచాయతీ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు, టిడిపిని బలోపేతం చేయడమే తన సంకల్పం అన్నారు. పలువురు హరీష్ నాయుడుని అభినందించారు.

అనుమతులు లేని భవనం తొలగింపు

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: నగరపాలక సంస్థ పరిధిలోని ఎన్‌జీవో కాలనీలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అదనపు అంతస్థు నిర్మాణాన్ని సోమవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది తొలగించారు. నగరంలోని ఎన్‌జీవో కాలనీ వుడ్ సైడ్ హోటల్ వెనుక వీధిలో అనుమతులు లేకుండా అదనపు అంతస్థు నిర్మాణాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో కమిషనర్ ఎన్ మౌర్య ఆదేశాల మేరకు పరిశీలించామని డిసిపి ఖాన్ తెలిపారు. అక్కడ అదనపు నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు లేక పోవడంతో నిర్మాణాలను తొలగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు మూర్తి, టిపిఓ వంశీ, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఏర్పేడు: మోదుగుల పాలెం పంచాయతీ కుమ్మర మిట్ట కండ్రిగ ఎస్‌టి కాలనీ వాసులకు వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పైడి అంకయ్య జన్మదినం సందర్భంగా దుప్పట్లు పంపిణీ చేశారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల ఇక్కడి వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిసి దుప్పట్లు పంపిణీచేశారని పైడి అంకయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి సిపిఐ నాయకులు జనామాల గురవయ్య , ఏఐటియుసి మల్లి, సుధీర్ , వే ఫౌండేషన్ సభ్యులు వినోద్, నాని, అఖిల్, రాకేష్ , ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ శిరీష, సిబ్బంది వెంకటేశు, మురగయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై సర్వే

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో పై ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశులు గ్రామాలలో పర్యటించి పిల్లలందరికీ పోలియో చుక్కలు వేశారా? లేదా అని పరిశీలించారు. వారికి అక్కడే పోలియో చుక్కలు వేయించి ప్రతి ఇంటిలోనూ పిల్ల లందరూ పోలియో చుక్కలు వేయించుకునేలా చూడాలన్నారు. మండలంలో పూర్తిగా పోలియో చుక్కలు వేయించాలని గ్రామాలలో పర్యటించారు. పల్స్ పోలియోలో చుక్కలు వేసుకోకుండా ఇంటిదగ్గర మారుమూల ప్రాంతంలో ఉన్న 111 మంది పిల్లలకు సోమవారం బుచ్చినాయుడు కండ్రిగ మండల పరంగా పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -సోమల: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ప్రపంచ మేధావి, తొలి న్యాయ శాఖ మంత్రి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం మండలంలో ఏర్పాటు కోసం సోమవారం పలు దళిత సంఘాలు ఏకమై కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడానికి అధికారులను స్థలం మంజూరు చేయాలని ఎన్నోసార్లు అడిగామని అయితే అధికారులు చెవిన వేసుకోకపోవడంతో నూతన కమిటీ ఏర్పాటు చేసి కమిటీ ద్వారా అధికారులపై ఒత్తిడి తెచ్చి అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కోసం స్థల మంజూరు ఇతర కార్యక్రమాలు నిర్వహించేందుకు కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. కమిటీలో మాటూరు మురళి, రామనాథం, ప్రకాష్ ,రెడ్డప్ప, శ్రీనివాసులు, అమర్నాథ్, శివరామయ్య, మొగలీశ్వరయ్య , వెంకటరామయ్య, రెడ్డప్ప, దొరస్వామి, రమణ, ఈశ్వరయ్యలు సభ్యులుగా వున్నారు.

సమస్యలపై స్పందించండి

సీఎంకు ఎమ్మెల్యే వినతి

ముఖ్యమంత్రికి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: వెంకటగిరి నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సోమవారం అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. డక్కిలి మండలంలోని ఆల్తూరుపాడు రిజర్వాయర్ నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని ఆయన సీఎంని కోరారు. ఎన్నికల ముందు వెంకటగిరి పర్యటనలో ఆల్తూరుపాడు రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని సీఎం ఇచ్చిన హామీని ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సుమారు 1.70 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తిరుపతి, తిరుమల, శ్రీకాళహస్తి ప్రాంత ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని వివరించారు. దీనిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వెంకటగిరి పట్టణంలో దీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోని గోషా ఆసుపత్రి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని సీఎం స్పష్టం చేసినట్లు చెప్పారు. గొడ్డేరు ఆనకట్ట నిర్మాణం, కైవల్యానది అభివృద్ధికి కూడా నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కైవల్యానదికి వరదలు వచ్చినప్పుడు పట్టణంలో నదికి ఇరువైపులా తీవ్రంగా కోత జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. నదికి ఇరువైపులా కాంక్రీట్ వాల్ నిర్మించడం, అవసరమైన చోట్ల చెక్‌డ్యాంలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరగా, ఇందుకు కూడా సీఎం సానుకూలంగా స్పందించి నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. డివిజన్ విభజన అంశంలో కలువాయి, రాపూరు, సైదాపురం మండలాల ప్రజల మనోభావాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని సీఎంను కోరినట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై సమావేశం

ప్రజాశక్తి -చంద్రగిరి: చంద్రగిరి మండలం, మండల సమైక్యలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం సంబంధించి కన్వర్జేన్స్ మీటింగ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం మాట్లాడుతూ పెరిగిపోయిన పురుగు మందుల వాడకం , కృత్రిమ ఎరువుల వాడకం తగ్గించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ శాఖల ఉద్దేశం, బాధ్యత అని అన్నారు. మండల వ్యవసాయ అధికారి విజయ్ భాస్కర్, సెర్ప్ మండల ప్రాజెక్ట్ మేనేజర్ గంగయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు అధికారి షణ్ముగం, అడిషనల్ డిపిఎం పట్టాభి రెడ్డి, సర్ప్ ప్రాజెక్టు మేనేజర్ రంగయ్య , మండల వ్యవసాయ అధికారి విజయ్ భాస్కర్, శిశు సంవర్ధక శాఖ అధికారి ధన , మాస్టర్ ట్రైనర్ : శ్రీదేవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శంకర్, సునీత, రామాంజనేయులు, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు, సంఘమిత్ర, వివో లీడర్లు , సభ్యురాలు హాజరయ్యారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ 14,15 యూనిట్స్, డిపార్ట్మెంట్ ఆఫ్ లా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సోమవారం ఏర్పాటు చేశారు. జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం నుంచి విచ్చేసిన రాజారెడ్డి, శ్రీనివాసులు వినియోగదారులకు ఉన్న హక్కుల గురించి, వస్తువుల కొనుగోలు విషయంలో బాగా జాగ్రత్తలు పాటించి షాపు యజమాని దగ్గర నుంచి తప్పకుండా బిల్లు తీసుకోవాలని సూచించారు. వినియోగదారులకు ఎలాంటి మోసాలు జరిగిన వినియోగదారులు తప్పకుండా వినియోగదారుల కమిషన్ లో ఫిర్యాదు చేసి నష్టపరిహారాన్ని పొందవచ్చని విద్యార్థులకు తెలిపారు. అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రోలజీ డిపార్ట్మెంట్ నుంచి శ్రీ స్వామి మాట్లాడుతూ వస్తువు నాణ్యత లోపం, కొలతల్లో మోసం జరగడాన్ని ఆరు విషయాలను దృష్టిలో పెట్టుకోవాలని ఆ ఆరు విషయాలు గురించి వివరించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ జగదీష్ మాట్లాడుతూ ఆహార పదార్థలు, పండ్లు, కూరగాయలు కొనేటప్పుడు జాగ్రత్తగా చూసి తీసుకోవాలని, అవి సరిగా లేనప్పుడు ప్రతి ఒక్కరూ ప్రశ్నించగలగాలనే అవగాహనను విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమలో ఆచార్య సీతా కుమారి, డాక్టరు స్వరాజ్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఆచార్య లలిత కుమారి పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో జాతీయ వర్క్‌షాప్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని బయోసైన్సెస్ అండ్ సెరికల్చర్ విభాగం ఆధ్వర్యంలో 'స్థిరమైన సెరికల్చర్ కోసం సాంకేతిక పరిజ్ఞానం బదిలీ' అనే అంశంపై రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించారు. రైతులు, విద్యార్థులు, ఇతర వాటాదారుల్లో అవగాహన పెంపు చేయడం, ఆధునిక, పర్యావరణ అనుకూల సాంకేతికతలను విస్తృతంగా వ్యాప్తి చేయడం ఈ వర్క్‌షాప్ ముఖ్య ఉద్దేశ్యం అని వర్క్‌షాప్ కార్యదర్శి, విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్ విజయకుమారి వివరించారు. ముఖ్య అతిథి హార్టికల్చర్ అండ్ సెరికల్చర్ డైరెక్టర్, డాక్టర్ కె శ్రీనివాసులు మాట్లాడుతూ పరిశోధన, బోధన, వ్యవసాయ రంగాల మధ్య జ్ఞాన అంతరాలను తగ్గించాల్సిన అవసరాన్ని తెలిపారు. పెస్ట్ రెసిస్టెన్స్ , క్లైమేట్ రెసిలియన్స్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. వర్క్‌షాప్ ముఖ్య అతిథి, వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వి ఉమ మాట్లాడుతూ ఎఐ, మెషిన్ లెర్నింగ్, నానోటెక్నాలజీ ప్రాముఖ్యతను వివరించారు. గౌరవ అతిథి మాజీ విసి డాక్టరు ఎస్‌బి దండిన్ మాట్లాడుతూ సెరికల్చర్ ద్వారా ఉపాధి కల్పన, రైతుల సాధికారత, విద్యార్థులకు హ్యాండ్‌హోల్డింగ్‌లో తమ ఫౌండేషన్ పాత్రను వివరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ రజని మాట్లాడుతూ సాంకేతిక బదిలీ ప్రాముఖ్యతను వివరించారు. ఉత్తమ సెరికల్చర్ రైతులకు డాక్టర్ ఎస్‌బి దండిన్ ఫౌండేషన్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో పురస్కారాలు, ప్రశంసా పత్రాలను అందించారు. ఈ వర్క్‌షాప్‌లో సుమారు 200 మంది సెరికల్చర్ రైతులు, వాటాదారులు, అధికారులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలి: ఎంఈవో

ప్రజాశక్తి- సోమల: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులలో దాగి ఉన్న సామర్థ్యాలను వెలికి తీసేందుకు తరగతి గదులలో ఉపాధ్యాయులు ప్రతి ఒక్క విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల విద్యాశాఖ అధికారిని విజయ కుమారి అన్నారు. సోమవారం మండలంలోని పెద్ద ఉప్పరపల్లె ప్రాథమిక పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయుల హాజరు విద్యార్థుల హాజరు మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. అనంతరం ఇటీవల ప్రభుత్వం అందించిన పలు రకాల బోధన అంశాల చార్టులను విద్యార్థులకు చూపి వారిలో దాగి ఉన్న పఠన సామర్థ్యాలను వెలికి తీశారు. బి, సి, డి విద్యార్థులు ఏ గ్రేడ్ కు వచ్చే విధంగా ఉపాధ్యాయులు ప్రతి ఒక్క విద్యార్థి పై శ్రద్ధ పెట్టాలని కోరారు. అనంతరం స్టాఫ్ మీటింగ్ నిర్వహించి ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు అందించారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

ముగ్గురి అరెస్ట్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న (ఓ వ్యభిచార గృహం) వారిపై పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేసిన ఘటన శ్రీకాళహస్తి పట్టణ సమీపంలోని చెంచులక్ష్మి కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. టూ టౌన్ పోలీసుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన సాయి, సునీల్ లు స్థానికంగా ఉన్న ఓ గదిని అద్దెకు తీసుకుని వ్యభిచారం ప్రారంభించారు. తిరుపతికి చెందిన ఓ యువతిని తీసుకువచ్చి ఆమెతో వ్యభిచారం చేయించి డబ్బు సంపాదిస్తున్నారు. సోమవారం అందిన సమాచారంతో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విచ్చల విడిగా బెల్టుషాపుల నిర్వహణ

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి మున్సిపాలిటి పరిధిలోని పలు ప్రాంతాల్లో బెల్టు షాపులను విచ్చల విడిగా నిర్వహిస్తున్నారు. సంబంధిత శాఖాధికారులు పట్టించుకోకపోవడంతో లైసెన్సు షాపులుగా ప్రజల్లో చలామణి అవుతున్నాయి. కాశీపేటలోని బస్‌షెల్టర్ వద్ద, క్రాస్‌రోడ్డు సమీపంలో ఎన్‌టిఆర్ కాలనీ ప్రాంతంలో, మనులాలపేటకు ప్రాంతంలో ఇలా చెప్పుకుంటూ పోతే పట్టణమంతా బెల్టుషాపులను బారులా మార్చేశారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా విచ్చల విడిగా మద్యం సేవిస్తూ కనిపిస్తున్నారు. అధికారుకు తెలిసిన, ఎవరైనా ప్రశ్నించినా 'ప్రభుత్వమే వ్యాపారాన్ని పెంచమంటుంది' అని అధికారులు చెప్పుకొస్తున్నారు. ఇకనైనా బెల్టుషాపులను నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వరల్డ్ మెడిటేషన్ డే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ధ్యాన దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు స్థానిక పుత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల పాఠశాల, సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజ్ లో ధ్యాన విద్యార్థి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ డి నాగరాజు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు స్కూలులో చదివే విద్య బాహ్య ప్రపంచానికి సంబంధించిన జ్ఞానాన్ని ఇస్తే ధ్యాన విద్య వారిలోని అంతర్ ప్రపంచానికి సంబంధించిన జ్ఞానం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీమ్ సభ్యులు శంకర నాయుడు, పురుషోత్తం చెట్టి, జగదీష్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల చైర్మన్ అశోక్ రాజుకు టీమ్ సభ్యులు నాగరాజ, శంకర నాయుడు, శ్వాస విజ్ఞాన జ్యోతి పుస్తకాని ్న అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కెసిఆర్, జగన్ దొందూ దొందే..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి మాజీ ముఖ్యమంత్రులు కెసిఆర్, జగన్‌లు నకిలీ నాయకులని టిడిపి బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం ఉమేష్ రావు సోమవారం విమర్శించారు. జగన్ పుట్టినరోజు నాడు పుట్టలోంచి బయటకు వచ్చిన కేసీఆర్ ఎంవోయుల గురించి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై అవాకులు చెవాకులు పేలడం హాస్యాస్పదమని మండిపడ్డారు. ఫేక్ ఎంవోయూలు చేసుకుంది ఎవరో ప్రజలందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా రాజకీయ అజ్ఞానంతో మాట్లాడడం మానుకోవాలని హితవు పలికారు.

మతాలు మధ్య బిజెపి చిచ్చు : సిపిఐ

ప్రజాశక్తి - తిరుపతి సిటి: బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మతాలు, ప్రాంతాలు, భాషలు, ఆహారం అలవాట్లు మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఐదు గంటలకు తిరుపతి సిపిఐ కార్యాలయంలో తిరుపతి నగర సమితి సమావేశం ఎన్ డి రవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పి మురళి మాట్లాడుతూ కులాలు, మతాల మధ్య ఘర్షణ లు పెట్టడం తో పాటు పాకిస్తాన్ ని ఎన్నికల్లో వాడుకున్నా గత ఎన్నికల్లో బీజేపీ కి సీట్లు గణనీయంగా తగ్గాయన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీని కూడా మోడీ అమలు చేయలేదన్నారు. సిపిఐ నగర కార్యదర్శి జె విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బండి చలపతి పాల్గొన్నారు.

సమస్యలు త్వరగా పరిష్కరించాలి: తహశీల్దారు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ప్రజల నుండి అందిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని తహశీల్దారు లోకనాథ పిళ్లై అధికారులను ఆదేశించారు. ఎస్ఆర్‌పురం తహశీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా 25 అర్జీలు స్వీకరించారు. వీటిని వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.